# లేటు చేయకు

పి. శ్రీనివాస చారి

దాదాపు మూడు సంవత్సరాలుగా ఒకే ఆఫీసులో కలిసి పనిచేసిన, ఆ అమ్మాయి ఈరోజే వూరినీ, ఆఫీసునీ వదలి వెళ్ళిపోతుంది. ఇంకా గంట మాత్రమే టైమ్ ఉంది ఎలా...ఎలా వెళ్ళడించాలి ఆమెతో తన ప్రేమని, ఇన్ని రోజులూ ఆ విషయం గురించి చర్చించడానికి తనకెలాగూ ధైర్యం చాలలేదు. కనీసం ఇప్పుడైనా....ఆ టెన్షన్‌లో అతని ఒళ్ళు చెమట పట్టింది.

చేతిలో ఉన్న ఫైల్స్ తీసి టేబుల్ మీద ఉంచుతూ, పక్క జేబులోంచి సిగరెట్ తీసి ముట్టించాడు.

మళ్ళీ అతనిలో ఆలోచనలు మొదలయ్యాయి.

ఎంత చలాకీ అమ్మాయి, ముట్టుకుంటేనే మాసిపోయే అందం, చక్రాల్లాంటి కళ్ళు, ఎర్రటి కెంపులు, చక్కని పెదవులు, అందమైన ఆ గుండ్రటి మోహానికి తగ్గట్టుగా క్రాఫ్... ఓహ్ ఆలోచిస్తేనే పిచ్చెక్కిపోతుంది. ఇంతగొప్ప సౌందర్యాన్ని ధరించిన ఆమె ప్రేమను పొందలేకపోతున్నానని అప్పుడప్పుడూ బాధపడేవాడు. కానీ ఏం లాభం. చూస్తుండగా తిరిగి పోతూంది-కాలచక్రం.

అయినా ఇది చివరి అవకాశం...

ఈరోజుతో మేమిద్దరం కలసి పనిచేసిన రోజులు గతించాయి.

విధి ఎంత విచిత్రమైనది...

ఏ సంబంధమూ లేని ఆమె మీద నాకెందుకింత ప్రేమ.

అనవసరంగా ఆ అమ్మాయిమీద లేనిపోని ఆశలు పెంచుకున్నాను. ఒకవేళ ఆమె కాదంటే...అమ్మో ఊహించడానికే కష్టంగా ఉంది.

ఇప్పుడు విడిపోతే మళ్ళీ కలిసే అవకాశం ఉందో లేదో!

నిజానికి ఆమె అమాయకపు మాటలే అంతగా అతన్నాకర్షించాయ్.

ఇప్పుడెలా...ఎలా...ఏదో ఒకటి చేయాలి.

లేదా ఇంతవరకూ వేచియున్న అదృష్టం చేజారిపోతుంది.

సిగరెట్ చివరి దమ్ములాగి కాలికింద వేసాడు.

నేనెంత వెర్రివాణ్ణి ఇప్పుడున్న ఈ టెన్షన్ మొదటి నుండే ఉండుంటే ఈపాటికి మా ఇద్దరికీ పెళ్ళయ్యేదేమో?

ఆమెకు కూడా నాపై ప్రేమ ఉండే ఉంటుంది. లేకపోతే అంత చనువుగా నవ్వుతూ మాట్లాడేదా!

అయినా నా వెర్రిగానీ ప్రేమించడానికి హృదయమొక్కటే చాలదు. ఎదుటివారి మెప్పుపొందే చొరవ, ధైర్యం కావాలి...

అతని పేరు రాజేష్.

అతని ఆలోచనల్ని భంగపరుస్తూ...

''ఎక్స్‌క్యూజ్ మీ రాజేష్ గారూ'' అన్న సన్నని గొంతు వినడంతో, తలపైకెత్తాడు.

''ఓ...మీరా అనుపమా! రండి. కూర్చోండి'' అన్నాడు. ప్రేమ, వినయం కలిపిన స్వరంతో.

ఇప్పుడు ''కూర్చోవడానికి టైం లేదు కానీ, బరువులు ఎక్కువగా ఉన్నాయి కాస్త స్టేషన్ వరకు సాయం వస్తారేమోనని'' కాస్త చొరవ తీసుకుంటూ అడిగింది.

నాన్సెన్స్ నా ఆలోచనల్లో అప్పుడే గంట గడిచిందా! ఉన్న గంట సమయమూ వృథా అయ్యింది ఇప్పుడెలా?

''మీరేదో ఆలోచిస్తున్నారు. అభ్యంతరమా?'' అంది నవ్వుతూ.

''అదేం లేదండీ! కానీ మీరు ట్రాన్స్‌ఫర్ పేరుతో నన్ను, మన స్టాఫును విడిచి వెళ్ళిపోతున్నారని బాధగా ఉంది.''

''బాధ నాకూ ఉందండీ కానీ ఏం చేస్తాం?''

''మన గవర్నమెంట్ ఉద్యోగాలే అటువంటివి.''


''మీకంత బాధగా ఉంటే అడ్రస్ ఇస్తాను. అప్పుడప్పుడూ లెటర్స్ వ్రాస్తుండండి'' అంటూ తన చేతిలోని విజిటింగ్ కార్డ్ అతని చేతిలో పెట్టింది.

అంతలో స్టేషన్ రానే వచ్చింది. ట్రైన్ కూడా రడీగా ఉన్నట్లుంది.

తొందర, తొందరగా వెళ్ళి సామాన్లన్నీ బెర్త్‌పై ఉంచి ఉంచగానే ట్రైన్ కదిలింది.

ఆ అమ్మాయికి వీడ్కోలు చెప్పి దిగాడు.

★★★



ఒక సంవత్సరం తరువాత...

''నువ్వేమయినా చెప్పరా రాజేష్ ఆ అమ్మాయితో నీ ప్రేమను మొదటే తెలిపుండాల్సింది'' అన్నాడు ఉదయ్ సిగరెట్ వెలిగిస్తూ.

ఉదయ్, రాజేష్ ఇంచుమించు చిన్నప్పటినుండీ ప్రాణ స్నేహితులు. ఆనందాన్నీ విషాదాన్నీ ఇద్దరూ కలిసి పంచుకునేవారు.

ఉదయ్‌కి రైల్వే డిపార్ట్‌మెంట్‌లో ఏదో చిన్న జాబ్.

సిగరెట్ చివరిదమ్ము లాగి కాలికింద వేసి నలుపుతూ అన్నాడు ఉదయ్...

''ఇప్పటికయినా మించిపోయింది లేదు. ఓ ప్రేమలేఖ వ్రాసి పోస్ట్ చెయ్'' అన్నాడు రాజేష్ వంక చూస్తూ.

''సరే చూద్దాం'' అన్నాడు రాజేష్ లోగొంతులో.

★★★

ప్రియమైన అనుపమగార్కి, రాజేష్ వ్రాయునది.

మీరంటే నాకెంతో ప్రేమ, అభిమానం. ఎంత ప్రేమంటే మాటల్లో చెప్పలేను.

ఈ విషయాన్నే మీతో ఇన్నిరోజుల నుండీ చెబుదామనుకున్నాను. కానీ నా గుండెకు ధైర్యం చాలలేదు. దానికి నా మనస్సు కూడా సహకరించలేదు.

అంతమాత్రాన మిమ్మల్ని ప్రేమించడం మానుకోలేదు. నా మనస్సెందుకో మిమ్మల్ని పదే పదే కోరుతుంది.

మీ ఊహారూపం నాకళ్ళ ముందు ప్రత్యక్షమైనప్పుడు మనస్సులో ఎక్కడో తీయని అనుభూతి.

మీరు లేని నా జీవితమే శూన్యం. ఒక రకంగా చెప్పాలంటే మీరు నా జీవితానికి ఎడారిలో ఒయాసిస్సు.

నిజానికి అసలు తప్పు మీది. ఎందుకంటారా! మీ అమాయకపు మాటలు చూపులే నన్నింతగా ఆకర్షించాయ్. మీరే గనక నాతో అంత చనువుగా ఉండి ఉండకపోతే, అసలు ఇన్ని ఆశలు పెట్టుకునే వాడినే కానేమో! ఇంతకుమించి వ్రాయడానికి ఏమీ తోచడం లేదు. తుది నిర్ణయాన్ని మీకే ఒదిలి పెడుతున్నాను.

మరి నా ప్రేమని అంగీకరిస్తారో లేక క్షమించి, తిరస్కరిస్తారో మీ యిష్టం.

సె-ల-వు

ఇట్లు

మీ ప్రేమ కోసం తపించే రాజేష్

ఉత్తరాన్ని ముగించి మరోక్కసారి చదివాడు.

★★★

రెండు రోజుల తర్వాత...

''ఒరేయ్ రాజేష్ ఆ అమ్మాయి నువ్వు ప్రేమించిన అమ్మాయి, అనుపమలా లేదూ!'' అన్నాడు ఉదయ్ ఆశ్చర్యంగా.

''అవున్రా! ఆ అమ్మాయే!''

''మరి పక్కన నిల్చున్న ఆ జెంటిల్‌మేన్ ఎవరు?'' రాజేష్ వంక చూస్తూ అన్నాడు ఉదయ్.

''పద కనుక్కుందాం'' అన్నాడు ఆత్రంగా రాజేష్.

వారిద్దరూ ఆమెను సమీపించారు. అంతలో...

''నమస్కారమండీ రాజేష్ గారూ'' అంది నవ్వుతూ అనుపమ.

రాజేష్ ప్రతి నమస్కారం చేస్తూ ''అవునూ మీరిక్కడ'' అంటూ ఇతనెవరన్నట్లుగా ప్రక్కన నిల్చున్న వ్యక్తి వైపు అనుమానంగా చూశాడు రాజేష్.

''ఓ..సారీ చెప్పనే లేదు కదూ! వీరు నా హజ్బెండ్, పేరు సురేష్. వీరేమో నేను ఈ వూళ్ళో పనిచేస్తున్నప్పుడు నా కొలీగ్ రాజేష్ గారు'' అంటూ ఇద్దరికీ పరిచయం చేసి చెప్పనారంభించింది.

''మా పెళ్ళయి మూడు నెలలవుతోంది. పని ఒత్తిడుల వలన మీకు ఇన్విటేషన్ ఇవ్వలేకపోయాను. క్షమించండి. సురేష్ ఉద్యోగరీత్యా ఈ వూరులోనే రెండు నెలలుగా ఉంటున్నాం. నా ఉద్యోగం మానేశాను. ఇన్ని రోజులుగా ఈ వూళ్ళోనే ఉంటూ మిమ్మల్ని కలవలేకపోయినందుకు ఏమీ అనుకోకండి. ఇలా ఏక్సిడెంటల్‌గా కలుసుకోవడం నాకు చాలా సంతోషంగా ఉంది. అన్నట్టు మాది లవ్ మ్యారేజీ.''

ఇంకా ఏదో చెప్తూపోతూంది.

కానీ రాజేష్ మాత్రం బెల్లం కొట్టిన రాయిలా అలాగే నిల్చుండిపోయాడు.

అతని చెవులెప్పుడో వినడం మానేశాయి.

తన ప్రేమ లేఖని కొన్ని నెలల ముందు రాసి వుండాల్సింది..ఎక్కడో అతని అంతరాత్మ ఘోషిస్తోంది.

★